క్లుప్తంగా

ఘనంగా కనకతల్లి పండగ

గుర్ల: మండలంలోని కెల్లలో కనకతల్లి పండుగను గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకమలతో అభిషేకాలు చేశారు. అలాగే ముర్రాటలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రభలను గ్రామంలో ఊరేగించారు.

గుంతల పూడ్చివేత



గుంతల్లో మిక్సర్ మెటల్ వేయిస్తున్న గ్రామ పెద్దలు

వేపాడ: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను గ్రామపెద్దల చొరవతో ఆదివారం పూడ్చారు. వర్షాలకు గుంతల్లో నీరు చేరి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. ఎన్‌డీబీ నిధులతో ఇటీవల రోడ్డు అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ సైడ్ కాలువలు నిర్మించకపోవడంతో వర్షపు నీరంతా రోడ్డు మీదే నిల్వ ఉంటోంది. దీంతో గుంతలేర్పడడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడ్డారు. దీంతో గ్రామపెద్దలు స్పందించి మిక్సర్ మెటల్‌తో గుంతలు పూడ్చారు.

దుర్వాసనతో ఇబ్బందులు



కుమ్మరి వీధిలో నిలిచిన మురుగు నీరు

గుర్ల: మండలంలోని కోటగండ్రేడు కుమ్మరి వీధిలో మురుగునీరు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు పలుమార్లు తెలియజేసినా పారిశుధ్య పనులు చేపట్టడం లేదని..కనీసం బ్లీచింగ్ అయినా చల్లడం లేదని వాపోయారు. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలు కూడా వృద్ధి చెంది జ్వరాలు ప్రబలుతున్నాయని, అధికారులు స్పందించి పారిశుధ్య పనులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

- ద్వామా పీడీ శారదాదేవి



వేతనదారులకు సూచనలు చేస్తున్న ద్వామా పీడీ శారదాదేవి

గజపతినగరం: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా ఉపాధి పనులకు వెళ్లే వేతనదారులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని ద్వామా పీడీ కె.శారదాదేవి అన్నారు. మండలంలోని మరుపల్లిలో ఆదివారం నిర్వహించిన ఈకేవైసీ క్యాంపెయిన్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మరో రెండు రోజుల పాటు క్యాంపెయిన్ నిర్వహిస్తామని, వేతనదారులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు..

దత్తిరాజేరు: మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఎస్. భూర్జవలస ఎస్సై రాజేష్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన వారికి అపరాధ రుసుం విధించారు.

ఘనంగా బంగారమ్మ విగ్రహ ప్రతిష్ఠ



ముర్రాటలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామంలో బంగారమ్మ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

అమ్మ కదిలింది..



శృంగవరపుకోట: ఊరేగింపులో దుర్గాదేవి విగ్రహం



శృంగవరపుకోట: దేవీ సంబరాల్లో రామ, లక్ష్మణ సమేత మారుతి

- సంబరంగా ఊరేగింపు
- ఆకట్టుకున్న నృత్యాలు..

శృంగవరపుకోట: పట్టణంలో కొలువుదీరిన దుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొమ్మిది అవతారాలతో అలరించింది. నవరాత్రులు ముగియడంతో శనివారం రాత్రి అమ్మ ఊరేగింపు ఉత్సవాన్ని దేవీ ఆలయ కమిటీ ఘనంగా నిర్వహించింది. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై కొలువుదీర్చి మంగళవాయిద్యాల నడుమ బాణసంచా కాలుస్తూ ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అమ్మవారి ఊరేగింపు ఉత్సవాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు.



శృంగవరపుకోట: వేర్వేరు వాయిద్యాలతో గణపతులు



శృంగవరపుకోట: సంబరంలో అలరించిన నవదుర్గలు



వేపాడ: వల్లంపూడి పురవీధుల్లో అమ్మవారి ఊరేగింపు

వైభవంగా దేవీ నిమజ్జనోత్సవం

వేపాడ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని వల్లంపూడిలో కొలువుదీరిన అమ్మవారిని శనివారం రాత్రి గ్రామ పురవీధుల్లో ఊరేగిస్తూ నిమజ్జనం చేశారు. తొమ్మిది రోజుల పాటు వివిధ అలంకరణలతో దర్శనమిచ్చిన దేవీకి భవానీ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. వేపాడ, వల్లంపూడి జంట గ్రామాల్లో అమ్మవారిని మేళతాళాల నడుమ ఊరేగించి దబ్బిరాజుచెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేషధారణలు అలరించాయి.



వేపాడ: పార్వతీపరమేశ్వర్ల వేషధారణలో కళాకారులు

చంద్రబాబు పాలన అంతా మోసమే..

- మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

దత్తిరాజేరు: ఎన్నికలలో తప్పుడు హామీలిచ్చి గద్దెనెక్కిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు ప్రజాకంటక పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆరోపించారు. మండలంలోని ఇంగిలాపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొల్లి తిరుపతి ఇంటిలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. అలాగే యూరియా అందించలేక రైతులను మోసం చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేయండి

- పార్టీ బూత్ ఇన్‌చార్జ్ తాడ్డి చందు



సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న బూత్ ఇన్‌చార్జ్ చందు

బొండపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలని పార్టీ బూత్ ఇన్‌చార్జ్ తాడ్డి చందు అన్నారు. మండలంలోని గిట్టుపల్లిలో పార్టీకి సంబంధించిన వివిధ విభాగాల అధ్యక్షులు, సభ్యులను ఆదివారం ఎన్నుకుని నియామకపత్రాలు అందజేశారు. గ్రామ పార్టీ అధ్యక్షుడిగా కర్రి కృష్ణ, కార్యదర్శిగా గొర్లె కన్నంనాయుడును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుప్పల్లో వర్షపాత నమోదు యంత్రాలు



తుప్పల్లో ఉన్న వర్షపాత నమోదు యంత్రం



భూగర్భజల నమోదు యంత్రం దుస్థితిది..

లక్కవరపుకోట: వర్షపాతం లెక్కింపు కోసం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మెషీన్లు తుప్పల్లో మూలుగుతున్నాయి. కురిసిన వర్షాలను ఆటోమేటిక్ వర్షపాతం నమోదు కేంద్రం ద్వారా లెక్కించి ఆ మండలాన్ని కరువు ప్రాంతంగా అధికారులు ప్రకటిస్తారు. అయితే మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో ఆటోమెటిక్ వర్షపాత నమోదు యంత్రం, భూగర్భ జలాల అంచనా యంత్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా భూగర్భ జలాలు అంచనా, వర్షపాత నమోదు లెక్కించి మండల స్థితిగతులను అంచనా వేస్తారు. అలాంటి కేంద్రాలు ప్రస్తుతం తుప్పల్లో మూలుగుతున్నాయి. కనీసం ఆయా కేంద్రాలకు వెళ్లేందుకు దారి సైతం లేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మా ఆకలి కేకలు వినబడవా..



మా ఆకలి కేకలు ప్రభుత్వానికి వినబడడం లేదా అని జిందాల్ నిర్వాసితులు ప్రశ్నించారు. బొడ్డవరలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఆదివారం కూడా కొనసాగించారు. జిందాల్ కంపెనీ సేకరించిన భూములను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు.

– శృంగవరపుకోట

జంగిల్ క్లియరెన్స్ చేపట్టరూ..



వేపాడ-ఆనందపురం రహదారిలో ఇరువైపులా పెరిగిన తుప్పలు

వేపాడ: వేపాడ – ఆనందపురం ప్రధాన రహదారిలో ఇరువైపులా పిచ్చిమొక్కలు బాగా పెరిగిపోయాయి. దీంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. బక్కునాయుడు చెరువు మలుపు వద్ద, భర్తవానిపాలెం బంజరు మలుపు వద్ద తుప్పలు పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఆర్అండ్‌బీ శాఖాధికారులు స్పందించి తుప్పలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా గొరపల్లి



గొరపల్లి జయప్రకాష్‌శివ

కొత్తవలస: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా మండలానికి చెందిన గొరపల్లి జయప్రకాష్‌శివ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తనపై పార్టీ ఎంతో నమ్మకముంచి రాష్ట్ర స్థాయి పదవి కట్టబెట్టిందన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తనకు పదవి రావడానికి సహకరించిన మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



ముస్తాబైన బంగారమ్మ గుడి

బంగారమ్మ పండగకు ఏర్పాట్లు పూర్తి

గజపతినగరం: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించనున్న బంగారమ్మ పండగకు సంబంధించి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం తొలేళ్లు, మంగళవారం పండగ, బుధవారం కనుమ పండగ నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామంలో అమ్మవారి ఘటాలను రెండుపూటాల ఊరేగిస్తుండడంతో సందడి వాతావరణం నెలకొంది.


నగరంలో విస్తృతంగా తనిఖీలు

విజయనగరం క్రైమ్: విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతర నేపథ్యంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ బృందాలు నగరంలో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఈ నెల 6న తొలేళ్ల ఉత్సవం, 7వ తేదీన సిరిమానోత్సవం జరగనున్న నేపథ్యంలో పోలీస్ బృందాలతో తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ ఆదివారం తెలిపారు. వేడుకల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

నగరంలో..ఉత్సవ శోభ!



విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న విజయనగరంలోని పలు ప్రాంతాలు



- వైభవంగా విజయనగరం ఉత్సవాలు
- విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న పురవీధులు
- రూ.90 లక్షల వ్యయంతో నగర సుందరీకరణ
- పర్యాటకులకు ఆహ్లాదం పంచేలా ఏర్పాట్లు

విజయనగరం: నగరంలో ఉత్సవ శోభ సంతరించుకుంది. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా విజయనగరం ఉత్సవాలతో పాటు పైడితల్లి జాతరకు నగరం ముస్తాబైంది. గత కొన్నిరోజులుగా వీటికి సంబంధించిన పనులు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో చాలా చురుగ్గా జరిగాయి. ఓ వైపు పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ఉత్సవాలు చూసేందుకు నగరానికి విచ్చేసే వారికి ఆహ్లాదం పంచేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. గతేడాది మిగిలిన రూ.30 లక్షల నిధులతో పాటు ప్రస్తుతం మంజూరు చేసిన రూ.60 లక్షలు మొత్తం కలిపి రూ.90 లక్షల వ్యయంతో నగర సుందరీకరణ సహా వేడుకలకు వచ్చే వారికి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నారు.

ఎక్కడెక్కడ ఏయే ఏర్పాట్లు..

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి జాతర నేపథ్యంలో నెల రోజులుగా విజయనగరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. రూ.4.20 లక్షలతో నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ఫౌంటేన్‌లు, వాటి పరిసరాల్లో మరమ్మతులు, రూ.9.70 లక్షలతో విజయనగరం ఉత్సవాల 11 వేదికలు, నగరంలోని ప్రధాన జంక్షన్లలో ప్రజలకు ఉపయోగపడేలా తాత్కాలిక మరుగుదొడ్లు, రూ.10.65 లక్షలతో నగరంలోని అన్ని ప్రధాన మార్గాల్లో సెంట్రల్ డివైడర్లు, వాటికి రంగులు, రూ.1.85 లక్షలతో ఆది, సోమ, మంగళవారాల్లో నగర ప్రజలకు తాగునీరు, రూ.4.5 లక్షలతో పారిశుధ్య పనులకు సామగ్రి వంటివి ఏర్పాటు చేశారు.

–ఇతర రాష్ట్రాల నుంచి..

మొత్తం మూడు రోజుల పాటు జరిగే విజయనగరం ఉత్సవాలతో పాటు పైడితల్లి జాతర మహోత్సవం చూసేందుకు ఉత్తరాంధ్ర జిల్లాల నలుమూలల నుంచే కాకుండా తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు, పర్యాటకులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విజయనగరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. నగరంలో ఏర్పాటు చేసిన 11 వేదికలపై జరిగే కార్యక్రమాలను భక్తులు, పర్యాటకులు, సందర్శకులు వీక్షిస్తారు. ఈ క్రమంలో ఆయా ప్రాంతాల్లో రూ.18 లక్షల వ్యయంతో రోడ్లలోని గుంతలు పూడ్చడంతో పాటు, రోడ్ల మరమ్మతులు చేపట్టారు.

అందరి సహకారంతో ఇది సాధ్యం..



ప్రజలందరి సహకారంతోనే విజయనగరం ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించడం సాధ్యవుతోంది. అన్ని ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు, పర్యాటకులు, సందర్శకులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకున్నాం. ప్రధానంగా పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాం.

– పల్లి నల్లనయ్య, కమిషనర్, విజయనగరం నగరపాలక సంస్థ

మోతాదుకు మించితే నష్టమే..

- క్రిమి సంహారక మందుల వినియోగం తగ్గించాలి
- మిత్ర పురుగులను కాపాడుకోవాలి
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

గుర్ల:

పంటలకు మోతాదుకు మించి క్రిమి సంహారక మందులు వినియోగించరాదని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. విపరీతంగా మందులు వినియోగిస్తే శత్రు పురుగులతో పాటు మిత్ర పురుగులు చనిపోయే అవకాశం ఉంది. శత్రు పురుగులను నాశనం చేయడంతో పాటు మిత్ర పురుగులను కాపాడుకోవాల్సిన బాధ్యత అన్నదాలపై ఉంది. రైతులకు మేలు చేసే మిత్ర పురుగుల గురించి ఏఓ అనురాధ వాడవాడలా అవగాహన కల్పిస్తున్నారు.

ట్రైకోగ్రాము..

పంటలను ఆశించే పచ్చ, లద్దె పురుగులు వాటి సంతతిని గుడ్ల ద్వారా పెంచుతాయి. ఈ పురుగులు పంట ఆకులపైనా, పంట లేత భాగాలపైన గుడ్లను పెడతాయి. అలా గుడ్ల నుంచి బయటకు వచ్చిన సంతతి పూత, ఆకు, పిందెలను తినేసి పంటకు పూర్తి స్థాయిలో నష్టం చేస్తాయి. ట్రైకోగ్రాము అనే పంట మిత్ర పురుగు పంటపై పచ్చ పురుగు, లద్దె పురుగు పెట్టిన గుడ్లను ఎప్పటికప్పుడు తినడం వలన వాటి సంతతి పెరగకుండా నివారించి పంటను కాపాడుతుంది.



పంటను కాపాడే మిత్ర పురుగులు

సాలీడు పురుగు..

పచ్చపురుగు, లద్దె పురుగులు పంటపై పెట్టిన గుడ్లు నుంచి వచ్చే సంతతి పురుగులను సాలీడు పురుగు ఎప్పటికప్పుడు తినేస్తూ వాటి సంతతి పెరగకుండా చేస్తుంది.

తూనీగ..

మిత్ర పురుగు అయిన తూనీగా చీడపురుగులు పంటపై పెట్టిన గుడ్లను తినడమే కాకుండా పరాగ సంపర్గం జరగడానికి చాలా దోహదపడుతుంది. తూనీగ ఒక మొక్కపై నుంచి మరొక మొక్కపై వాలినప్పుడు మగ పుష్పంలో ఉన్న పుప్పొడి రేణువులను ఆడ పుష్పంపై వదలడం వల్ల ఫలదీకరణ జరిగి పిండం, ఆ తర్వాత విత్తనం, పంట చేతికి అందేలా దోహదపడుతుంది.

గుడ్ల దశలోనే చీడ పురుగులు నాశనం..

కందిరీగ, క్రైసోపా, మిడత, పొడాసిస్, బగ్ వంటి మిత్ర పురుగులు సైతం చీడ పురుగులు వరి పంటపై పెట్టిన గుడ్లను ఎప్పటికప్పుడు తినేస్తూ పంటను కాపాడుతాయి. ఇలా రైతుకు ఒక పైసా ఖర్చు లేకుండా చీడ పురుగులను నివారిస్తున్న మిత్ర పురుగులు ఇప్పుడు రైతుల నిర్లక్ష్యం కారణంగా నశించిపోతున్నాయి. ముఖ్యంగా క్రిమి సంహారక మందులు, విష వాయువుల మందులు పిచికారీ చేయడం వలన మిత్ర పురుగులు వేగంగా నశించిపోతున్నాయని వ్యవసాయాధికారి ఎం.అనురాధ రైతులకు తెలియజేస్తున్నారు.

అధికం అనర్థం..

క్రిమి సంహారక మందులు వాడాల్సిన అవసరం లేకపోయినప్పటికీ మోతాదుకు మించి వినియోగించడం అనర్థం. పంటలో ఒకటి, రెండు చీడ పురుగులు కనబడినంత మాత్రాన వాటి నివారణకు మందులు వాడాల్సిన అవసరం లేదు. పర్యావరణం ద్వారా అవి నశిస్తాయి. అలాంటి పురగులు ఎక్కువ స్థాయిలో కనిపిస్తే అవసరమైన మేరకు, లేదా వ్యవసాయాధికారుల సూచనల మేరకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలి.

– నాగరాజు, ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి, గుర్ల

కొట్లాట ఘటనపై కేసు నమోదు

భోగాపురం: మండల కేంద్రంలో ఈ నెల 2వ తేదీన కనకదుర్గమ్మ నిమజ్జనోత్సవంలో భాగంగా చేపట్టిన ఊరేగింపులో ఓ రెండు వర్గాల మధ్య కొట్లాట జరిగింది. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పాపారావు శనివారం తెలిపారు. దసరా ఉత్సవాల్లో భాగంగా జరిగిన ఊరేగింపులో దుబ్బక సురేష్, లోకేశ్, అభి అనే ముగ్గురు వ్యక్తులు కలిసి మరడ వంశీ అనే వ్యక్తిని పంచాయతీ కార్యాలయం వద్దకు రమ్మని అతడిపై దాడికి ఎగబడ్డారు. ఈ దాడిలో వంశీ చేయి విరిగిపోగా అతడి స్నేహితుడు అడ్డగర్ల అరుణ్‌కుమార్..చికిత్స నిమిత్తం వంశీని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు వంశీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్‌ఐ పేర్కొన్నారు.

యువతి అదృశ్యం..

భోగాపురం: మండలంలోని కొల్లిపేటకు చెందిన ఓ యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సూర్యకుమారి ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి ఇంతవరకు ఇంటికి రాలేదని, చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గజపతినగరం 9010204447 | చీపురుపల్లి 9951602843 | ఎస్.కోట 9951602965

Office mail : vzmadvt@gmail.com